# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ అనుకూలమైన రాష్ట్రమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

❖ ఈ నెల 24 నుంచి 9 రోజుల పాటు "విశాఖ ఉత్సవ్"ని నగరంలో నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

❖ రాష్ట్ర సమాచార కమీషన్ కు కొత్తగా నియమితులైన కమీషనర్లు ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.

❖ రాష్ట్రంలో మార్చి 16 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

❖ సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి చందనోత్సవం ఏప్రిల్ 20న జరగనుంది.

=======================

పెట్టుబడులు పెట్టేందుకు అత్యుత్తమ గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. దావోస్ పర్యటనలో భాగంగా రెండవ రోజు అయిన ఈ రోజు సీఐఐ నిర్వహించిన బ్రేక్ ఫాస్ట్ సెషన్‌లో నిర్వహించిన "ఆంధ్రప్రదేశ్ లో అవకాశాలు" అనే అంశంపై ముఖ్యమంత్రి ప్రసంగించారు. రాష్ట్రానికి వచ్చి ప్రభుత్వం అమలు చేస్తోన్న విధానాలు, పెట్టుబడులకు ఉన్న సానుకూల వాతావరణాన్ని స్వయంగా పరిశీలించాలని పారిశ్రామికవేత్తలను ఆయన ఈ సందర్భంగా ఆహ్వానించారు. 2047 నాటికి భారత్ ప్రపంచ శక్తిగా మారుతుందని, అందులో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలుస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడులలో 25 శాతం ఆంధ్రప్రదేశ్ ఆకర్షించినట్టుగా చంద్రబాబు నాయుడు వెల్లడిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

ఇదిలా ఉండగా.. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, ఇంధనం, డిజిటల్ ఇన్ ఫ్రా, లాజిస్టిక్స్, తయారీ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులకు నెలకొన్న అవకాశాలపై ఈ సెషన్‌లో చర్చించారు.

========================

విశాఖ నగరంలో ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు 9 రోజుల పాటు "విశాఖ ఉత్సవ్"ని నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఉత్సవ్ నిర్వహణ తదితర అంశాలపై చర్చించేందుకు విశాఖ కలెక్టరేట్ మీటింగు హాలులో రాష్ట్ర మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, కందుల దుర్గేశ్, కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఈ రోజు నిర్వహించారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఈ సందర్భంగా అధికారులకు మంత్రులు దిశా నిర్దేశం చేశారు. విశాఖ ఎంపీ ఎం. శ్రీ భరత్, విశాఖ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులు, మూడు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

========================

రాష్ట్ర సమాచార కమీషన్ కు నూతనంగా నియమితులైన కమీషనర్ల చేత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పదవీ ప్రమాణ స్వీకారాన్ని ఈ రోజు చేయించారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమాచార కమీషన్ చీఫ్ కమీషనర్ గా వజ్జా శ్రీనివాసరావు, కమిషనర్లుగా పరవాడ సింహాచలం నాయుడు, వంటేరు రవిబాబు, ఆదెన్న గాజుల, చరత్ చంద్ర కళ్యాణ చక్రవర్తి వట్టికూటి ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామకృష్ణ, ఆర్టీఐ అధికారులు పాల్గొన్నారు.

========================

రాష్ట్రంలో 10వ తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి తుది షెడ్యూల్ ని ఎస్.ఎస్.సీ బోర్డు పరీక్షల విభాగం ఈ రోజు విడుదల చేసింది. మార్చి 16 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయని పేర్కొంది. ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయని తెలిపింది. మార్చి 16వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకండ్ లాంగ్వేజ్, 20న ఇంగ్లీష్, 23న మ్యాథ్‌మెటిక్స్, 25న ఫిజికల్ సైన్స్, 28న బయోలాజికల్ సైన్స్, 31న సోషల్ స్టడీస్ పరీక్షలు జరుగుతాయని వెల్లడించింది.

విరామం

========================

రాష్ట్రంలో పూర్తి కచ్చితత్వంతో రీసర్వే 2.0 చేపడుతున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఇప్పటికే మూడు దశల్లో 2,097 గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యిందని చెప్పారు. నాలుగవ దశలో 1,613 గ్రామాల్లో కొనసాగుతున్నట్లు వెల్లడించారు. రైతుల సంపూర్ణ భాగస్వామ్యంతో ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నామని, రీసర్వే కాలాన్ని 90 రోజుల నుంచి 143 రోజులకు పెంచామని మంత్రి తెలియజేశారు.

========================

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుండి 31 వరకు 15 రోజుల పాటు దేశవ్యాప్తంగా స్వచ్ఛతా పఖ్వాడా జరుగుతోంది. ఇందులో భాగంగా విజయవాడలోని ఒక కళాశాలలో స్వచ్ఛత గురించి విద్యార్థులకు తెలియచేస్తున్నామని అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్మెంట్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మణస్వామి తెలిపారు. ప్రతీ రోజు 60 నుంచి 70 కిలోల వ్యర్థ పదార్థాలను సేకరిస్తున్నామని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 21 సెకన్లు)

========================

విశాఖ జిల్లాలోని సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 20న చందనోత్సవం జరగనుంది. ఈ ఉత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని వివిధ విభాగాల అధికారులను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఇతర అధికారులతో కలిసి స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో చందనోత్సవం ఏర్పాట్లపై మంత్రి సమీక్షా సమావేశాన్ని ఈ రోజు నిర్వహించారు.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 23వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

========================

దావోస్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ఐబీఎం ఛైర్మన్ అర్వింద్ కృష్ణతో ఈ రోజు సమావేశం అయ్యారు. అమరావతిలో క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్ నెలకొల్పాలని ఈ సందర్భంగా ఆయనను ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని అర్వింద్ కృష్ణ పేర్కొన్నారు. అదే విధంగా చంద్రబాబు నాయుడుతో గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ సమావేశమయ్యారు. విశాఖలో 'గూగుల్ ఏఐ డేటా సెంటర్' నిర్మాణాన్ని ఎటువంటి జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆయనను కోరారు.

========================

బంగ్లాదేశ్ నుంచి ఉత్తరాంధ్ర మత్స్యకారుల విడుదల ఉత్తర్వులపై విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్ హర్షం వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ కోస్ట్ గార్డ్ సిబ్బందికి మత్స్యకారులు 9 మంది పట్టుబడి కొన్నాళ్ళుగా అక్కడ బంధీలుగా ఉన్నారు. ఉత్తరాంధ్రకు చెందిన మత్స్యకారులు పేద కుటుంబాలకు చెందినవారని, వారి జీవనోపాధి కోసం సముద్రంలోకి వెళ్లి అనుకోకుండా సరిహద్దులు దాటడం వల్ల ఈ పరిస్థితి ఎదుర్కోవడం జరిగిందని ఈ సందర్భంగా శ్రీ భరత్ అన్నారు.

========================
========================